శిల్పారామంలో నేడు పంచాంగ శ్రవణం

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఉగాది ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం గంటలకు ప్రముఖ కవి, జ్యోతిష్కులు, ఉస్మాని విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు సాగి కమలాకర శర్మ పంచాంగ శ్రవణం చేస్తారు. అనంతరం శ్రీ దత్త నాట్యాలయ గురువు రష్మీ సచిదానందా శిష్య బృందం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. సాంప్రదాయ పద్ధతిలో ఉగాది పండుగను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి.కిషన్ రావు తెలిపారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నాం

- ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో భారీగా నిధుల కేటాయింపు
- ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గాంధీ వెల్లడి
- గచ్చిబౌలి డివిజన్‌లో రూ.7.03 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



గచ్చిబౌలి డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

రాయదుర్గం/శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం సాయంత్రం రూ.7.03 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్‌లోనే కాకుండా ఇతర అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లి చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, రోడ్లు, మెట్రో సౌకర్యం, విస్తరణ, థీమ్‌పార్కులు, చెరువుల సుందరీకరణ తదితర అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన గుర్తు చేశారు. కాలనీలు, బస్తీల్లో అంతర్గ రోడ్లను సీసీ రోడ్లుగా, ప్రధాన రోడ్లను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చడం, వీధిదీపాలు ఏర్పాటు, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మంచి నీటి సరఫరాను మెరుగుపర్చేందుకు ఇప్పటికే పెద్ద ఎత్తున మంచినీటి ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు అదనంగా సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చడంలో భాగంగా నాలా విస్తరణ, వరదనీటి కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీజీఎం నారాయణ, డివిజన్ నాయకులు గణేష్‌ముదిరాజ్, మోహన్‌గౌడ్, రాజునాయక్, సత్యనారాయణ, నరేష్, సురేందర్, అంజమ్మ, జంగయ్యయాదవ్, యాదగిరి, శ్రీనుపటేల్, రాజు ముది రాజ్, బాలమణి, వినోద్, మల్లేష్, అక్బర్, నర్సింహ్మరాజు, అనీల్‌సింగ్‌తోపాటు పలువురు గోపన్‌పల్లి తాండ, హుడాకాలనీ, ప్రశాంత్‌హిల్స్, సాయివైభవ్‌కాలనీ, సాయిఐశ్వర్య, వినాయక్‌నగర్‌వాసులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

టీఎన్జీఓ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

టీఎన్జీఓకాలనీలో నీటి సరఫరా మెరుగు పర్చేందుకు తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు., ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా, జలమండలి అధికారులతో కలిసి పనులను ప్రారంభించారు. దశలవారీగా టీఎన్‌జీఓ కాలనీలో అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు టీఎన్‌జీఓకాలనీ వాసులు పాల్గొన్నారు.

కోవిడ్ కేసులు నిల్

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరి యా జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన కోవిడ్ టెస్టులలో పాజిటివ్ కేసులు నమోదు కాలేదని ఆస్పత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ వరదా చారి తెలిపారు. మంగళవారం 23 మందికి రాపిడ్ యాంటిజెన్ కోవిడ్ టెస్టులు చేశారు. ఆ టెస్టుల్లో ఎవరికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కాలేదని ఆయన పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య



అరవింద్ (ఫైల్)

మియాపూర్: కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి లోనైన ఓ యువకుడు హోటల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా, పొట్టిలంక గ్రామానికి పేరూరి అరవింద్ (28)కు చింతల్‌కు చెందిన రమ్యతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఏడాదిగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరానికి వచ్చిన అరవింద్ హాఫీజ్‌పేట్ వైశాలినగర్‌లోని తన బంధువు దుర్గప్రసాద్ ఇంట్లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం ఉద్యోగానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. అదే రోజు మధ్యాహ్నం దుర్గప్రసాద్ ఫోన్ చేయగా రెండో షిఫ్టు కూడా ఉందని రాత్రికి ఇంటికి వస్తానని చెప్పాడు. రాత్రి అతను ఇంటికి తిరిగి రాకపోవడంతో దుర్గాప్రసాద్ అతడి కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. చందానగర్‌లోని వీవీ ఫ్రైడ్ హోటల్‌లో ఆరా తీయగా సోమవారం మధ్యాహ్నం రూమ్ నెంబర్ 47లో అతను బస చేసినట్లు హోటల్ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం మాస్టర్ కీ సహాయంతో తలుపులు తెరిచి చూడగా అరవింద్ సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్ షీట్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. మృతుడి బంధువు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీలను రక్షించుకుంటాం

మియాపూర్: మియాపూర్ సర్వే నెంబర్ 28 లోని బస్తీలను రక్షించుకుంటామని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ అన్నారు. మంగళవారం నడిగడ్డతాండలోని గిరిజన సంక్షేమ సంఘం భవనంలో నడిగడ్డతాండ, సుభాష్‌చంద్రబోస్, ఓంకార్‌నగర్ బస్తీ వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 2 వేల కుటుంబాలు ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నాయన్నారు. మియాపూర్‌లోని 28 సర్వే నెంబర్‌లోని 384 ఎకరాలను కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీ భవనాలు నిర్మించారని ఆరోపించారు. ఇదే సర్వే నెంబర్‌లోని నడిగడ్డతాండలో 25.35 ఎక రాలు, ఓంకార్ నగర్‌లో 10.28 ఎకరాలు, సుభాష్‌చంద్రబోస్‌నగర్ 12.08 ఎకరాల్లో పేదలు నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా కాలనీల్లో నివాసముంటున్న ప్రజలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: విద్యార్థులు ఇష్టపడి చదవాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి సహకారంతో శేరిలింగంపల్లి, లింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో మంగళవారం పదవ తరగతి చదివే విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కింది స్థాయి నుంచి బాగా చదివి తల్లిదండ్రులు, ఆయా స్కూల్స్, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్.శంకర్, శైలజ, టీచర్లు మహేందర్‌రెడ్డి, బలరామ్, శివకుమార్, జంగయ్య, సురేందర్, సరిత, టీఆర్ఎస్ నాయకులు వీరేశం గౌడ్, గోపాల్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, బసవరాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లిలో క్లీనప్‌డ్రైవ్



రాయదుర్గం: గోపన్‌పల్లిలో క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని మంగళవారం జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయ ఉత్సవాలను పురస్కరించుకుని ఈ క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచనల మేరకు అధికారులు ఆలయ పరిసరాల్లో ఉదయం నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు పర్యవేక్షించారు.

ఉగాది ఉత్సవాలకు గోపన్‌పల్లి రంగనాథ ఆలయం ముస్తాబు

ఏటా రెండు రోజుల పాటు ఉగాది ఉత్సవాలు



రంగనాథస్వామి ఆలయ ప్రధాన ద్వారం

రాయదుర్గం: ఉగాది ఉత్సవాలకు చారిత్రక గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఏటా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

పూజా కార్యక్రమ వివరాలివీ..

- బుధవారం ఉగాది పర్వదినాన స్వామివారికి ఉదయం 8 గంటలకు మహాభిషేకం, 9 గంటలకు స్వామి వారి ఆభరణాల ఊరేగింపు, 10.30 గంటలకు అలంకరణ, 12.30 గంటకు నైవేద్యం సమర్పణ, సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక దీపారాధన, రాత్రి 9 గంటలకు స్వామి వారి రథోత్సవ నిర్వహిస్తారు.
- గురువారం ఉదయం స్వామివారిని స్థానిక సింగబావి (ప్రస్తుతం కనుమరుగైంది) వద్దకు భాజాభజంత్రీలతో తీసుకెళ్లి అవభృత స్నానం చేయిస్తారు.
- అనంతరం ఆలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 8.30 గంటలకు పంచాంగశ్రవణం నిర్వహిస్తారు. ఉగాది రోజే అంతటా పంచాంగశ్రవణం నిర్వహిస్తే ఇక్కడ మాత్రం మరుసటి రోజు నిర్వహించడం విశేషం.
- గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పర్యవేక్షణలో జీహెచ్ఎంసీ సిబ్బంది ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు.
- ఆలయ పరిసరాల్లో శ్రీరాముడు, వెంకటేశ్వరస్వామి, అమ్మవారి చిత్రాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పనులు చకచకా

మూడునెలల్లో అందుబాటులోకి ఇంటిగ్రేటెడ్ మార్కెట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న రైతు బజార్‌ను పూర్థిస్థాయిలో ఆధునికీకరించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌గా అభివృద్ధి చేస్తున్నారు. పనులన్నీ చకచకా జరుగుతున్నాయి. మూడు నెలల్లో ఈ మార్కెట్ అందుబాటులోకి రానుంది. 2004లో భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయికాలనీలో రూ.40లక్షల వ్యయంతో రైతుబజార్ నిర్మించారు. తమ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోలేదని కొందరు రైతులు, రైతుబజార్ నిర్మించిన స్థలం అనువుగా లేదంటూ మరికొందరు అటువైపుగా చూడనేలేదు. దీంతో అప్పటి నుంచి రైతుబజార్ వినియోగంలోనే లేదు. దీంతో శిథిలావస్థకు చేరగా, అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారింది. స్థానికులు కూరగాయల కొనుగోలుకు 6 కిలోమీటర్ల దూరంలోని లింగంపల్లి రైతుబజార్‌కు వెళుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుబజార్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కోరారు. దీంతో ఆయన నామమాత్రపు మరమ్మతులతో తాత్కాలికంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత 2021లో ఇంటిగ్రేటెడ్ రైతుబజార్‌ను నిర్మించేందుకు రూ.2.99 కోట్లు మంజూరు చేశారు. పనులన్నీ పూర్తయ్యేనాటికి ఖర్చు రూ.4.80 కోట్లకు చేరింది. అన్ని వస్తువులు ఒకేచోట లభించేలా అధునాతన వసతులతో మార్కెట్‌ను అభివృద్ధి చేశారు. నాలుగు భారీ షెడ్లు నిర్మించారు. ఒక్కో షెడ్డులో 26 దుకాణాల వరకూ ఏర్పాటు చేసుకునే వీలుంది. మొత్తంగా 104 దుకాణాలకు ఈ నాలుగు షెడ్లను వినియోగించుకోవచ్చు. మాంసం, కూరగాయలు, పండ్లు, నిత్యావసర సరుకులు అమ్మేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



జీ-20 లోగోను తిలకిస్తున్న వీసీ తదితరులు

'మనూ'లో జీ-20 యూనివర్సిటీ కనెక్ట్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం జీ-20 యూనివర్సిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ మార్గదర్శకత్వంలో యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ క్లబ్‌కు చెందిన విద్యార్థులు జీ-20 లోగోను అందంగా తీర్చిదిద్దారు. ఉస్మానియా పార్కుకు ఎదురుగా ఉన్న బాబ్-ఈ-ఇల్మ్(ప్రధాన గేటు)లోపల వివిధ రంగులతో విద్యార్థులు లోగోను తీర్చిదిద్దారు. ఈ లోగోను తిలకించిన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీ-20 దేశాలకు భారతదేశం అధ్యక్ష బాధ్యతలను చేపట్టడం గర్వకారణమన్నారు. ఈ తరుణంలో వర్సిటీ క్యాంపస్‌లో జీ-20 లోగోను రంగులతో తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్లు నసీమ్‌ఫాతిమా, అబ్దుల్ సమీసిద్ధిఖీ, యూసుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సీతారాముల కల్యాణ తలంబ్రాలు

టీఎస్ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

రాయదుర్గం: టీఎస్ఆర్టీసీ కార్గో ద్వారా భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి కల్యాణ తలంబ్రాలను ఇంటికే తీసుకువచ్చి అందజేసేలా సేవా కార్యక్రమాన్ని ప్రారంభినట్లు హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ పి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. భద్రాచలం వెళ్లి సీతారాముల కల్యాణం చూడలేని భక్తులు కేవలం రూ.116తో టీఎస్ఆర్టీసీ కార్గో ద్వారా బుక్ చేసుకుంటే ఈ నెల 30న స్వామి వారి కల్యాణం అనంతరం తలంబ్రాలను పార్సిల్ రూపంలో 10 నుంచి 15 రోజుల్లో తమ ఇంటికే వచ్చి అందజేయడం జరుగుతుందన్నారు. భక్తులు స్వామి వారి తలంబ్రాలను మహాప్రసాదంగా భావిస్తారని , ఈ తరుణంలో ఆర్టీసీ అందిస్తున్న ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుకింగ్ కోసం కార్గో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మరిన్ని వివరాలకు ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విజేందర్‌రెడ్డి ఫోన్ నెంబర్ 9849567204, 9652267204లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నీటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలి



వాక్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు

రాయదుర్గం: నీటి ప్రాధాన్యత్‌పై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక నడక కార్యక్రమాన్ని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజినల్ డైరెక్టర్ సిద్ధార్థ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మానవ జీవితంలో నీటి ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. నీటి ప్రాముఖ్యతను గుర్తించేందుకు ప్రత్యేక నడక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సెంట్రల్ గ్రౌండ్‌వాటర్ బోర్డు ఎస్ఆర్ రీజినల్ డైరెక్టర్ సిద్ధార్థ కుమార్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ఏటా మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది టెలికామ్‌నగర్‌లో నడక కొనసాగించారు. అనంతరం క్యాంపస్‌లోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నీటిపై ప్రత్యేక డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్లు షకీల్ ఆహ్మద్, మహ్మద్ అబ్దుల్ అజీమ్, సయ్యద్ అలీమ్ అష్రఫ్‌జైసీ, ముష్తాక్ ఆహ్మద్, మహ్మద్ ఫరియాద్‌తోపాటు పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.